క్లుప్తంగా

కెనరా బ్యాంకు సిబ్బంది స్వచ్ఛతాహీ సేవ



స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది

కడప కోటిరెడ్డిసర్కిల్ : మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా కెనరా బ్యాంకు సిబ్బంది బుధవారం స్వచ్ఛతాహీ సేవ–2024 నిర్వహించారు. బ్యాంకు రీజినల్ హెడ్ మురళీమోహన్ ఆధ్వర్యంలో నగరంలోని భగత్‌సింగ్ పార్కులో సిబ్బంది పిచ్చి మొక్కలు తొలగించి పరిసరాలను శుభ్రపరిచారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు డివిజనల్ మేనేజర్లు షఫీక్ అహ్మద్, విలియం కుమార్ పాల్గొన్నారు.

'దసరా' ప్రత్యేక సంచిక ఆవిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కడప ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు

కడప కల్చరల్ : ఇంటాక్ రూపొందించిన శరన్నవరాత్రి ఉత్సవాల ప్రత్యేక సంచిక మన చరిత వారసత్వ బులెటిన్‌ను ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు సూరు వినోద్, తల్లం సతీష్, ఉత్సవ కమిటీ చైర్మన్ పరిటాల వెంకటరమణ, చింతకుంట పుల్లయ్య, పడుచూరి వెంకటేశ్వర్లు, మాజీ అధ్యక్షులు బుధవరపు కృష్ణమూర్తి బుధవారం ఆవిష్కరించారు. కడప వాసవీ కన్యకా పరమేశ్వరీదేవి ఆలయంలో జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ భారతీయ సంస్కృతి సంప్రదాయాలలో పండగ ఒక భాగమని, అందులో దసరా ఉత్సవాలు సంస్కృతిని ప్రతిబింబిస్తాయని పేర్కొన్నారు. పుస్తక ఆవిష్కరణ చేసిన వారికి జిల్లా చాప్టర్ కన్వీనర్ లయన్ కె.చిన్నపరెడ్డి ధన్యవాదాలు తెలిపారు.

మెకానిక్‌కు తీవ్ర గాయాలు



సంకాలయ్య

కడప కోటిరెడ్డి సర్కిల్: ఏపీఎస్సార్టీసీ కడప గ్యారేజీలో బుధవారం మధ్యాహ్నం సూపర్ లగ్జరీ బస్సు కింద పడి మెకానిక్ సంకాలయ్యకు గాయాలయ్యాయి. బుధవారం బస్సుకు ఎలక్ట్రికల్ వర్క్ చేస్తుండగా మెకానిక్ సంకాలయ్య మెయింటెనెన్స్ కొరకు బస్సు కిందకు వెళ్లాడు. చెక్ చేస్తున్న సమయంలో సంకాలయ్యను గమనించిన సిబ్బంది ఒకరు బస్సు స్టార్ట్ చేశారు. దీంతో సంకాలయ్య కుడి చేతివేళ్లు ఛిద్రమయ్యాయి. వెంటనే అతడిని స్థానిక ఆస్పత్రికి తరలించారు. ఉద్దేశ పూర్వకంగా జరిగిన తప్పుకాదని.. పొరపాటు జరిగిందని అధికారులు తెలిపారు.

జష్నే మిలాద్ నబీ ఫ్లెక్సీలను తొలగించడం దారుణం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ మైనార్టీ నాయకులు

కడప కార్పొరేషన్ : మహమ్మద్ ప్రవక్త జన్మదినం (మిలాద్ ఉన్ నబీ) సందర్భంగా ఏర్పాటు చేసిన జష్నే మిలాద్ నబీ ఫ్లెక్సీలను నగరపాలక అధికారులు తొలగించడం దారుణమని వైఎస్సార్‌సీపీ మైనార్టీ నాయకులు ఎస్ఎండీ షఫీ, ఎస్ఏ కరిముల్లా, అక్బర్ అలీ అన్నారు. స్థానిక వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ గత 25 ఏళ్లుగా ఎన్‌టీఆర్ సర్కిల్‌లో జష్నే మిలాద్ నబీ కార్యక్రమం రాజకీయాలకు అతీతంగా జరుగుతోందన్నారు. దైవ కార్యక్రమాలకు సంబంధించి వేసే ఫ్లెక్సీలు, బ్యానర్లకు ఎలాంటి రుసుం చెల్లించనవసరం లేదని కార్పొరేషన్ సర్వసభ్య సమావేశంలో తీర్మానించారన్నారు. జష్నే మిలాద్‌నబీకి సంబంధించి వేసిన ఫ్లెక్సీలకు టౌన్‌ప్లానింగ్ విభాగంలో చలానాలు చెల్లించినప్పటికీ తొలగించడం సరికాదన్నారు. కార్యక్రమం జరుగుతున్న సమయంలో కావాలనే కరెంటు తీయించి కక్షసాధింపు చర్యలకు దిగడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. టీడీపీ నేతల మెప్పు కోసం ఇలా చేస్తున్న అధికారులు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఎస్ఏ షంషీర్, మున్నా, అహ్మద్ పాల్గొన్నారు.

కూలీలకు సరిపడా పనులను గుర్తించాలి

వల్లూరు : 2025–26 సంవత్సరానికి సంబంధించి గ్రామ పంచాయతీ పరిధిలోని కూలీలు చేయడానికి సరిపడా పనులను గుర్తించాలని ఏపీవో సుధారాణి తెలిపారు. మండలంలోని గ్రామ పంచాయతీల్లో బుధవారం 2025–26 ఆర్థిక సంవత్సరంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపట్టాల్సిన పనుల గుర్తింపునకు సంబంధించిన ప్రణాళికల రూపకల్పనకు సమావేశాలను నిర్వహించారు. దిగువపల్లెలో సర్పంచ్ కుళ్లాయప్ప అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఏపీవో పాల్గొని పనుల గుర్తింపుపై అవగాహన కల్పించారు.

శాంతి సేనానికి ఘన నివాళి



వైవీయూలో గాంధీ చిత్రపటానికి పూలమాల వేస్తున్న వీసీ, ప్రిన్సిపల్



కోటిరెడ్డి మహిళా డిగ్రీ కళాశాలలో గాంధీకి నివాళి



నివాళులర్పిస్తున్న మానవతా సంస్థ సభ్యులు

కడప కల్చరల్ : శాంతి సేనాని బాపూజీకి నగర వాసులు ఘనంగా నివాళులర్పించారు. మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకుని ప్రముఖులు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజా సంఘాలు నగరంలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా దేశ స్వాతంత్య్ర సమపార్జనకు ఆయన చేసిన త్యాగాలను గుర్తు చేసుకున్నారు.

■ లయన్స్ క్లబ్ ఆఫ్ కడప అన్నమయ్య, భారత జాతీయ కళా సంస్కృతి వారసత్వ పరిరక్షణ సంస్థ(ఇంటాక్) ఆధ్వర్యంలో క్లబ్ జిల్లా అధ్యక్షుడు ఎ.వెంకటసుబ్బయ్య, జిల్లా కన్వీనర్ లయన్ చిన్నప్పరెడ్డి, లయన్ కె.సంజీవరెడ్డి, పద్మప్రియ చంద్రారెడ్డి, గౌరీశంకర్, గునిశెట్టి శ్రీనివాసులు, కొండారెడ్డి, వర్మ తదితరులు వన్‌టౌన్ వద్దగల బాపూజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

■ మానవత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఐటీఐ వద్ద గాంధీజీ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. మానవత నగర అధ్యక్షుడు బైరెడ్డి విష్ణు శివమోహన్ రెడ్డి, గంగిరెడ్డి, రిలయన్స్ మాధవ రెడ్డి, సంస్థ వ్యవస్థాపకులు రామచంద్రారెడ్డి, అవటాల రామాంజులరెడ్డి, రాటాల గోపి కార్యక్రమంలో పాల్గొన్నారు.

■ రెడ్‌క్రాస్ సంస్థలో చైర్మన్ జి.శివశంకర్‌రెడ్డి, సిబ్బంది గాంధీజీ చిత్రపటానికి పూలమాల అలంకరించి నివాళులర్పించారు.

■ బాసట స్వచ్ఛంద సేవా సంస్థలో చిన్నారులు నిర్వాహకులతో కలిసి గాంధీజీ చిత్రపటం వద్ద పూలు సమర్పించి నివాళులర్పించారు.

గాంధీజీ జీవితంపై చిత్ర ప్రదర్శన

కడప ఎడ్యుకేషన్ : గాంధీ జయంతి సందర్భంగా జన విజ్ఞాన వేదిక, సర్ సివి.రామన్ సైన్స్ క్లబ్, ప్రభుత్వ ఆర్ట్స్ పురుషుల కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో గాంధీజీ జీవితంపై బుధవారం ఛాయాచిత్ర ప్రదర్శన ఏర్పాటు చేశారు. కడప ఐటీఐ సర్కిల్ వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో సర్ సీవీ.రామన్ సైన్స్ క్లబ్ అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ గాంధీజీ జీవితం, ఆయన మహోన్నత ఆశయాల గురించి వివరించారు. 160 మందికి పైగా విద్యార్థులు పాల్గొనగా, ప్రతిభ చూపిన 16 మందికి సర్టిఫికెట్స్, పుస్తకాలు బహుమతిగా అందజేశారు. ఈ కార్యక్రమంలో డా.గునిశెట్టి శ్రీనివాసులు, గంగిరెడ్డి, వెంకట్రామిరెడ్డి, డా.రామచంద్ర, వీరసుదర్శనరెడ్డి, సమత, సునీత, అరుణ, వెంకటేశ్వర్లు, దేవదత్తం, శివరాం, రాయల్ అబ్దుల్ కరీముల్లా, వెంకటరామ రాజు, నరసింహారెడ్డి పాల్గొన్నారు.

ప్రపంచ దేశాలకు గాంధీ సిద్ధాంతాలు ఆదర్శం

కడప ఎడ్యుకేషన్ : ప్రపంచ దేశాలకు మహాత్మా గాంధీ సిద్ధాంతాలు ఆదర్శమని ఎస్టీయూ రాష్ట్ర నాయకులు సురేష్ బాబు, బాల గంగిరెడ్డి పేర్కొన్నారు. మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా స్థానిక ఐటీఐ కూడలిలోని గాంధీ విగ్రహానికి ఎస్టీయూ నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సురేష్‌బాబు, బాలగంగిరెడ్డి మాట్లాడుతూ గాంధీ అహింసా మార్గం నేటి ప్రపంచం దేశాలకు ఆదర్శమని, ఆయన సిద్ధాంతాలు అనుసరణీయమని అన్నారు. ఎస్టీయూ ఎస్టియు జిల్లా అధ్యక్షుడు ఇలియాస్‌బాషా మాట్లాడుతూ మహాత్మాగాంధీ జీవితం నేటి యువతకు మార్గదర్శకమని అన్నారు. ఈ కార్యక్రమంలో భాస్కర్, చెన్నకేశవరెడ్డి, సనావుల్లా, ఖాదర్‌బాషా, లోకేశ్వర్‌రాజు, తులసీధర్, సాధిక్‌అలి, మహబూబ్‌బాషా, వెంకటసుబ్బయ్య, హబీబుల్లా ఖాదర్ బాషా, గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

వన్‌టౌన్‌లో గాంధీ జయంతి

కడప అర్బన్ : మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా కడప నగరంలోని వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో బాపూజీ చిత్రపటానికి సీఐ బి. రామకృష్ణ, ఎస్ఐ సిద్ధయ్య, బుధవారం తమ సిబ్బందితో కలిసి నివాళులర్పించారు.



గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఏడీ, కార్యాలయ సిబ్బంది



గాంధీ చరిత్ర వివరిస్తున్న సివీ.రామన్ సైన్స్ క్లబ్ అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి

వైవీయూలో విద్యార్థుల మానవహారం

వైవీయూ : యోగి వేమన విశ్వ విద్యాలయంలో మహాత్మా గాంధీకి పలువురు ఘనంగా నివాళులర్పించారు. విశ్వవిద్యాలయం ప్రాంగణంలోని స్వచ్ఛ భారత్ వేదికపై మహాత్ముడి చిత్రపటానికి వైస్ ఛాన్సలర్ ఆచార్య కె.కృష్ణారెడ్డి, ప్రిన్సిపల్ ఆచార్య ఎస్.రఘునాథ్ రెడ్డి, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డా.ఎన్.వెంకట్రామిరెడ్డి, విద్యార్థులు, తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వీసీ మాట్లాడుతూ శాంతి, అహింస మార్గాలుగా గాంధీ పోరాడిన తీరు అందరూ అనుసరించాలన్నారు. అనంతరం బాలికల వసతిగృహం వద్ద ఎన్ఎస్ఎస్ పీఓ డాక్టర్ శ్రీధర్‌రెడ్డి విద్యార్థులు చే స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయించారు. అధ్యాపకులు డా.రాజగోపాల్ రెడ్డి, వాలంటీర్లు పాల్గొన్నారు.

వైఎస్ఆర్ ఏఎఫ్‌యూలో..

నగరంలోని డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విశ్వ విద్యాలయంలో మహాత్మాగాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి జయంతి సందర్భంగా ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ రాజేష్‌కుమార్‌రెడ్డి గాంధీ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మహాత్ముడు, లాల్‌బహదూర్ శాస్త్రిలు దేశానికి చేసిన సేవల గురించి కొనియాడారు. ఈ కార్యక్రమంలో వై.మనోహర్‌రావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆర్ట్స్ కళాశాలలో..

నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాలలో గాంధీ జయంతి సందర్భంగా ఎన్‌సీసీ అధికారి డాక్టర్ ఆర్.నీలయ్య ఆధ్వర్యంలో స్వచ్ఛతా కార్యక్రమాలు నిర్వహించారు. ప్రిన్సిపల్ డా.జి. రవీంద్రనాథ్ మాట్లాడుతూ గాంధీ మార్గంలో యువత నడవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారి డా.మహేష్, రవిశేఖర్, సావిత్రి, నరసింహారావు, హజరతయ్య, సునీల్ కుమార్ పాల్గొన్నారు.

కేఎస్ఆర్ఎంలో..

కడప ఎడ్యుకేషన్ : మహాత్మగాంధీ నేటి యువతకు స్ఫూర్తిదాయకమని కేఎస్ఆర్ఎం ప్రిన్సిపల్ వీఎస్ఎస్.మూర్తి అన్నారు. కడప ఐటీఐ సర్కిల్ వద్ద గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఆయన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్ ప్రేమ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

కోటిరెడ్డి మహిళా డిగ్రీ కళాశాలలో..

కడప నగరంలోని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా ప్రిన్సిపల్ డా.వి.సలీంబాషా గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అధ్యాపకులు గురుమోహన్‌రెడ్డి, విజయలక్ష్మి, సుబ్బారెడ్డి, రవిశేఖర్‌రెడ్డి, ఖాజామోహియుద్దీన్, విద్యార్థులు పాల్గొన్నారు. నగరంలోని పలు వీధుల్లో స్వచ్ఛతా కార్యక్రమాలపై అవగాహన కల్పించారు.

పింఛనర్ల సంఘం కార్యాలయంలో

నగరంలోని ప్రభుత్వ పింఛనర్ల సంఘం కార్యాలయంలో గాంధీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్సీ పోచంరెడ్డి సుబ్బారెడ్డి, పదవీ విరమణ డిప్యూటీ డీఈఓ నాగమునిరెడ్డి, శ్రీనివాసులు గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నగేష్, నారాయణ, పుల్లయ్య, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

దిన్నెపాటి బసిరెడ్డి వికాస్‌లో..

దిన్నెపాటి బసిరెడ్డి వికాస్‌లో గాంధీ జయంతి సందర్భంగా అపుస్మ రాయలసీమ జోనల్ ఇన్‌ఛార్జి విశ్వనాథరెడ్డి, దిన్నపాటి బసిరెడ్డి గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కో ఆర్డినేటర్ శివకళ, విద్యార్థులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌కో నిలయంలో..

కడప కార్పొరేషన్ : శంకరాపురంలోని ట్రాన్స్‌కో నిలయంలో మహాత్మాగాంధీ జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చీఫ్ ఇంజినీర్ ఎల్.క్రిష్ణమనాయుడు గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈలు క్రిష్ణకుమార్, బాషా, కె.శ్రీనివాసరావు, వీరభద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

గొప్ప స్వాతంత్ర సమరయోధులు గాంధీ

కడప ఎడ్యుకేషన్ : గొప్ప స్వాతంత్య్ర సమరయోధుడు జాతిపిత మహాత్మగాంధీ అని డీఈఓ మర్రెడ్డి అనురాధ, కార్యాలయ ఏడీ మునీర్‌ఖాన్ అన్నారు. డీఈఓ కార్యాలయంలో బుధవారం గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డీఈఓ కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



గాంధీజీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న వివిధ సంస్థల ప్రతినిధులు



పాఠశాల ఆవరణంలో మొక్కలు నాటుతున్న ప్రతినిధులు



ఆర్ట్స్ కళాశాలలో ఎన్‌సీసీ కేడెట్స్ స్వచ్ఛతా కార్యక్రమాలు



గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సీఐ బి.రామకృష్ణ



వైఎస్ఆర్ ఏఎఫ్‌యూలో గాంధీ జయంతి



ట్రాన్స్‌కో నిలయంలో నివాళులర్పిస్తున్న చీఫ్ ఇంజనీర్ క్రిష్ణమనాయుడు



గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎస్టీయూ నాయకులు



గాంధీ విగ్రహానికి పూలమాల వేస్తున్న ప్రిన్సిపల్ వీఎస్ఎస్.మూర్తి



గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న పింఛనర్ల సంఘం నాయకులు

హిందువుల మనోభావాలు దెబ్బతీయొద్దు

కడప కల్చరల్ : హిందువుల మనోభావాలు దెబ్బతీసే సంఘటనలు ఇటీవల చోటుచేసుకోవడం దురదృష్టకరమని, సున్నితమైన అంశాలు అశాంతికి దారితీస్తాయనే విషయాన్ని గుర్తించాలని విశ్వ హిందూపరిషత్ ప్రాంత ధర్మాచార్య సంపర్క్ ప్రముఖ్ బెస్తవేముల రామమహేష్, బి.మఠం అచలానంద ఆశ్రమం పీఠాధిపతి విరాజానంద స్వామి, కడప ఉత్తరాధిమఠం ప్రతినిధి మాళిగి విద్యానిధి పేర్కొన్నారు. నగరంలోని ఎన్జీఓ కాలనీలోని కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయం నుంచి పలు హిందూ సంఘాల ఆధ్వర్యంలో బుధవారం శాంతియుత నిరసన ర్యాలీ నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా హిందువులు అత్యంత పవిత్రంగా భావించే తిరుమల లడ్డూ ప్రతిష్ఠను దెబ్బతీసే సంఘటనలు జరగడం దురదృష్టకరమన్నారు. ప్రొద్దుటూరు శివదర్శనానంద సరస్వతి మాతాజీ మాట్లాడుతూ దేవాలయాలను ప్రభుత్వ ఆధ్వర్యం నుంచి తప్పించి హిందూ పీఠాలకు అప్పగించాలని, ఆలయాల్లో హిందూయేతరులను తొలగించాలని కోరారు. అనంతరం ముఖ్య కూడళ్ల మీదుగా కాషాయ పతాకాలతో మహావీర్ సెంటర్ వరకు ర్యాలీ కొనసాగించారు. ఈ కార్యక్రమంలో వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి, ప్రధాన కార్యదర్శి మనోహర్‌రెడ్డి, ప్రతినిధులు చంటి, సంజీవరాజు, అమర్‌నాథరెడ్డి, చిక్కన్న, ప్రకండ కార్యకర్తలు పాల్గొన్నారు.



హిందూ సంఘాల శాంతియుత నిరసన ర్యాలీలో పాల్గొన్న మహిళలు

సృజనాత్మకత వెలికి తీసేందుకే పోటీలు

కడప ఎడ్యుకేషన్ : ఉపాధ్యాయులలో సృజనాత్మకత వెలికి తీసేందుకే క్రీడలు, సాంస్కృతిక పోటీలు నిర్వహిస్తున్నట్లు ప్రముఖ వైద్యులు డాక్టర్ ఓబుల్‌రెడ్డి పేర్కొన్నారు. యూటీఎఫ్ స్వర్ణోత్సవ వేడుకల సందర్భంగా కడప అంధుల పాఠశాలలో విభిన్న ప్రతిభావంతులైన టీచర్లకు ఏర్పాటుచేసిన పోటీలను బుధవారం ఆయన ప్రారంభించారు. ఓబుల్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థి సర్వతోముఖాభివృద్ధికి పాటుపడుతూ నిత్యం బోధనలో ఉపాధ్యాయుడు తల మునకలై ఉంటాడని, మానసిక వికాసం కలగాలంటే శారీరక వ్యాయామం అవసరమని అన్నారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయకుమార్, పాలెం మహేష్ బాబు మాట్లాడుతూ అధ్యయనం, అధ్యాపనం, సామాజిక స్పృహ లక్ష్యంగా ఏర్పాటైన యూటీఎఫ్ 50 వసంతాలు పూర్తి చేసుకుందన్నారు. అంధ ఉపాధ్యాయులకు చెస్, క్యారమ్స్, షాట్ పుట్, వంద మీటర్ల రన్నింగ్ క్రీడలతోపాటు, విద్యారంగ పరిరక్షణ– ఉపాధ్యాయుల పాత్ర అంశంపై వకృత్వ, సామాజిక, రాజకీయ, ఆర్థిక అంశాలపై క్విజ్ నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో ఎబినేజర్, నరసింహారావు, ఎజాస్ అహ్మద్, రూతు ఆరోగ్య మేరీ, ఎం.ప్రభాకర్, పి.పార్థసారధి, ఎ.రాజా, లక్ష్మణరావు, సుబ్బరాయుడు, సుబ్బరాయుడు, భాస్కర్ రెడ్డి, బాలయ్య, నాగరత్నమ్మ పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రముఖ వైద్యులు డాక్టర్ ఓబుల్‌రెడ్డి

6 నుంచి ఏపీటీఎఫ్ రాష్ట్ర వైజ్ఞానిక మహా సభలు

కడప ఎడ్యుకేషన్ : అక్టోబర్ 6 ,7, 8వ తేదీలలో విజయనగరంలో జరిగే ఓక్ జూబ్లీ వేడుకలు, 20వ రాష్ట్ర విద్యా వైజ్ఞానిక మహాసభలను విజయవంతం చేయాలని ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాళ్లపల్లె అబ్దుల్లా కోరారు. ఏపీటీఎఫ్ ఆవిర్భవించి 80 సంవత్సరాలు పూర్తిచేసుకున్న సందర్భంగా కడప ఎన్జీవో హోంలో రాష్ట్ర మహా సభల గోడపత్రికలను (వాల్ పోస్టర్స్) ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సభలకు ప్రముఖులు హాజరవుతారని, విద్యా ప్రగతి, ఉపాధ్యాయ సంక్షేమం, సామాజిక శ్రేయస్సు, మహిళా సాధికారతపై సదస్సు జరుగుతుందని తెలిపారు. జిల్లా ఉపాధ్యక్షుడు నాగభూషణం, జిల్లా కార్యదర్శి చెన్నారెడ్డి మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాలలకు సంబంధించిన జీవో 117ను రద్దు చేయాలని, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని అన్నారు. ఈ సమావేశంలో ఏపీటీఎఫ్ నాయకులు వేణుగోపాల్‌రెడ్డి, శంకర్ రెడ్డి, నారాయణరెడ్డి, సుబ్బారెడ్డి, శ్రీనివాసులు, నరసింహారెడ్డి, రాజేంద్ర, కమల్‌బాషా పాల్గొన్నారు.



ఏపీటీఎఫ్ జూబ్లీ వేడుకల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

నేటి నుంచి అమ్మవారి ఆలయాల్లో నవరాత్రి ఉత్సవాలు

కడప కల్చరల్: నగరంలోని ఆలయాలలో గురువారం నుంచి నవరాత్రి ఉత్సవాలు వైభవంగా ప్రారంభించనున్నారు. ఇందుకోసం కడప నగరంలోని వాసవీ కన్యకా పరమేశ్వరీదేవి ఆలయంలో ఉత్సవాలను భారీగా నిర్వహించేందుకు ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. విజయదుర్గాదేవి ఆలయం, చెన్నైరోడ్డులోని లలిత పంచాయతన ఆలయాలను విద్యుద్దీపాలతో తీర్చిదిద్దారు. నగరంలోని పలు అమ్మవారి ఆలయాలు కూడా దసరా ఉత్సవాలకు రెట్టించిన ఉత్సాహంతో తుది మెరుగులు దిద్దుకుంటున్నాయి.

కడప కల్చరల్ : కడప విజయదుర్గాదేవి ఆలయంలో గురువారం నుంచి శరన్నవరాత్రులు ప్రారంభం కానున్నామని ఆలయ వ్యవస్థాపకులు మల్లికార్జునరావు, నిర్వాహకులు దుర్గాప్రసాద్ తెలిపారు. విలేకరులతో వారు మాట్లాడుతూ తొలి రోజు తెల్లవారుజామున అమ్మవారికి తొమ్మిది పవిత్ర జలాలు నింపిన కలశాలతో నవ కలశ స్నపనం చేస్తామన్నారు. అనంతరం వేదపండితులు రాయపద్ది. సుబ్బరామశర్మ ఆధ్వర్యంలో యాగశాలలో విజయదుర్గ, చండీ హోమం, శ్రీచక్ర మండపంలో నవావరణ, శ్రీచక్రార్చన ఉంటాయన్నారు. సాయంత్రం 6.30 నిలకు విజయదుర్గాదేవిని 'శైలపుత్రి' దేవిగా అలంకరిస్తామని, రాత్రి 8 గంటలకు విజయదుర్గ, మల్లికార్జునుల ప్రదక్షిణ ఉంటాయని తెలిపారు.

■ శంకరాపురం ఎస్‌బీఐ వెనుక వీధిలో గురువారం నుంచి దసరా ఉత్సవం వైభవంగా నిర్వహించనున్నట్లు ఉత్సవ నిర్వహణ కమిటీ ప్రతినిధి గోవర్ధన్ తెలిపారు. 3న బాలా త్రిపురసుందరీ దేవిగా, 4న గాయత్రిదేవిగా, 5న అన్నపూర్ణగా, 6న లలితాంబగా, 7న వారాహి దేవిగా, 8న మహాకాళిగా, 9న సరస్వతిగా, 10న దుర్గాదేవిగా, 11న మహిషాసురమర్దినిగా, 12న రాజరాజేశ్వరీదేవిగా అలంకరిస్తామని తెలిపారు. రోజూ సాయంత్రం 7 గంటల నుంచి కుంకుమార్చన, చండీహోమం ఉంటాయన్నారు. బుధవారం వడి బియ్యం కార్యక్రమం నిర్వహిస్తామని, 12న అన్నదానం ఉంటుందన్నారు.

మత్యన్యకాపరమేశ్వరీ ఆలయంలో...

కమలాపురం : పట్టణంలోని అమ్మవారు శాలలో వెలసిన శ్రీ మత్కన్యకాపరమేశ్వరీ దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలను ఈనెల 3వ తేదీ నుంచి 13వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కామిశెట్టి వెంకటరమణయ్య, కోశాధికారి మాలేపాటి మల్లికార్జున తెలిపారు. మహోత్సవాలకు మహిళలు, మహిళా మండలి సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాలను విజయవంతం చేయాలన్నారు. 3వ తేదీన అమ్మవారు దీక్షా బంధన అలంకారంలో దర్శనమిచ్చి భక్తులను కనువిందు చేస్తారన్నారు. 4న అర్ధనారీశ్వరీదేవి అలంకారంలో, 5న రాజరాజేశ్వరీదేవీ అలంకారం, 6న గాయత్రీదేవి అంలకారం, 7న అన్నపూర్ణదేవి అలంకారం, 8వ తేదీన వైష్ణవిదేవి, 9న సరస్వతిదేవి(బిందెసేవ) అలంకారం, 10న దుర్గాదేవి (మహిశాసురమర్దిని) అలంకారంలో, 11న కనక మహాలక్ష్మీదేవి అలంకారం, 12న విజయ దశమి(గ్రామోత్సవం) అలంకారంలో దర్శనమిస్తారన్నారు. 13వ తేదీన పాన్పు సేవ (వసంతోత్సవం) అలంకారంలో కన్యకాపరమేశ్వరీదేవి దర్శనమిస్తారని, భక్తులు అమ్మవారిని దర్శించుకుని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని వారు కోరారు. అలాగే భక్తుల సౌకర్యార్థం అన్ని వసతులు ఏర్పాటు చేసినట్లు వారు వివరించారు.

మహిళా మండలి ఆధ్వర్యంలో

పట్టణంలో వెలసిన అమ్మవారిశాలలో వాసవి మహిళా మండలి ఆధ్వర్యంలో ప్రతిరోజు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు మహిళా మండలి ప్రెసిడెంటు మాలేపాటి లక్ష్మీదేవి తెలిపారు. రోజు ఉదయం 11 గంటల నుంచి అమ్మవారికి కాలచక్ర దీపపూజ నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. అలాగే ప్రతిరోజు రాత్రి 9 గంటలకు లక్కిడిప్ ద్వారా బహుమతులు అందజేస్తామని ఆమె తెలిపారు.



మీడియాతో మాట్లాడుతున్న ఆలయ వ్యవస్థాపకులు సుధా మల్లికార్జునరావు



కడప నగరం శంకరాపురంలో ఉత్సవాల కోసం ఏర్పాటు చేసిన అమ్మవారి మూర్తి

నగరంలో రెండు మోటార్ సైకిళ్లు దగ్ధం

కడప అర్బన్: కడప నగరంలోని మాసాపేటలో రెండు ద్విచక్ర వాహనాలకు గుర్తు తెలియని దుండగులు నిప్పు పెట్టారు. బాధితుడు వరప్రసాద్ ఎర్రముక్కపల్లిలోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో టీచర్‌గా పనిచేస్తున్నాడు. మంగళ వారం రాత్రి పల్సర్, హోండా యాక్టివా బైకులను ఇంటి ఆవరణంలో పార్క్ చేసి ఉంచాడు.

అర్ధరాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు రెండు బైక్‌లకు నిప్పటించడంతో పూర్తిగా కాలిపోయాయి. ఈ సంఘటనపై బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎస్‌కెఎం హుసేన్ తెలిపారు.

అంగడి వద్ద అగ్నిప్రమాదం

కడప అర్బన్: కడప నగరంలోని రెండవ గాంధీ బొమ్మ సమీపంలో ఓ అంగడిలో గ్యాస్ లీకై అగ్ని ప్రమాదం జరిగిన వున్న అద్దాల ఫర్నిచర్ పగిలిపోయింది. ఎలాంటి అపాయం జరుగలేదు

ఉపాధ్యాయులకు బకాయిలు వెంటనే చెల్లించాలి

కడప ఎడ్యుకేషన్ : ఉద్యోగ, ఉపాధ్యాయుల బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చెల్లించాలని మాజీ ఎమ్మెల్సీ పొచంరెడ్డి సుబ్బారెడ్డి డిమాండ్ చేశారు. కడప శాంతినికేతన్ స్కూల్‌లో జరిగిన ఉమ్మడి జిల్లా ప్రగతిశీల రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ డీఏలు, ప్రావిడెంట్ ఫండ్, ఏపీజీఎల్ఐ, సరెండర్ లీవ్ డబ్బులు తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. పీఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు లెక్కల జమాల్‌రెడ్డి మాట్లాడుతూ మూడో తరగతి నుంచి సబ్జెక్టు ఉపాధ్యాయులు ఉండాల్సిందేనన్నారు. రాష్ట్ర గౌరవాధ్యక్షుడు పి.సి.రెడ్డన్న మాట్లాడుతూ గత ప్రభుత్వం పీఆర్సీ కమిటీ అంటూ కాలయాపన చేసిందని, ప్రభుత్వం చిత్తశుద్ధితో 11వ పీఆర్సీ ప్రకటించాలని కోరారు. జిల్లా అధ్యక్షుడు పీవీ.సుబ్బారెడ్డి మాట్లాడుతూ సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని, కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ఏకీకృత పెన్షన్ ఆమోదయోగ్యం కాదని తెలిపారు. రాష్ట్ర మైనారిటీ కన్వీనర్ మజహారుల్ హక్ మాట్లాడుతూ అన్ని పాఠశాలకు ఉపాధ్యాయులను సర్దుబాటు చేసి, హై స్కూల్ ప్లస్ పాఠశాలలకు సర్దుబాటు చేయకపోవడం శోచనీయమన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామాంజనేయరెడ్డి మాట్లాడుతూ ఎంఈవో–2 పోస్టులను రద్దు చేయడం సమంజసం కాదని, ఇప్పుడున్న పని ఒత్తిడిలో ఇద్దరూ ఉండాల్సిందే అన్నారు. రాష్ట్ర కార్యదర్శి మునిరెడ్డి మాట్లాడుతూ కొత్తగా స్కూల్ కాంప్లెక్స్ ఏర్పాటులో హెచ్ఎంలకు డీడీఓ పవర్స్ ఇవ్వడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో ఓబుల్ రెడ్డి, సుబ్బారెడ్డి, షేక్ జక్రియబాషా, లియాకత్, హబీబుల్ రెహమాన్, నర్సింహారెడ్డి, గౌస్, కతీఫ్, అస్మత్ బాషా పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ పొచంరెడ్డి సుబ్బారెడ్డి